సాక్షి సిద్దిపేట

సోమవారం, 27, ఫిబ్రవరి, 2023



పార్క్‌లా వైకుంఠధామం

సంగారెడ్డి జిల్లా సదాశివపేట 65వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన హిందూ వైకుంఠధామం పార్కును తలపిస్తోంది. 8లో..



చింతపండు కోసం చెట్టెక్కి..

చింతపండు సేకరించేందుకు చెట్టెక్కిన మహిళ పట్టుతప్పి కిందపడి దుర్మరణం చెందింది. ఈ ఘటన వర్గల్ మండలం నాచారంలో చోటుచేసుకుంది. 8లో..



పశువైద్యం.. అందేదెలా?

మిరుదొడ్డి మండల కేంద్రంలో రూ.25 లక్షలతో ప్రారంభించిన పశువైద్యశాల భవనం అసంపూర్తిగా ఉండడంతో వైద్యసేవలు అందడంలేదు. 9లో..

న్యూస్‌రీల్

ముగింపు వేడుకలకు ఆహ్వానం



మంత్రి హరీశ్‌రావుకు ఆహ్వాన పత్రం అందిస్తున్న నాయకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): సీఎం కేసీఆర్ జన్మదినం పురస్కరించుకొని జగదేవ్‌పూర్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్రేస్ బాల్ టోర్నమెంట్ పోటీల ముగింపు కార్యక్రమానికి రావాలని సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్ గుప్తా, ఆత్మ కమిటీ చైర్మన్ రంగారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రి హరీశ్‌రావును కలిసి ఆహ్వానం అందించారు. మార్చి 3న నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని విజేతలకు బహుమతులను అందించాలని కోరగా, మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఏక్బాల్, యూత్ నాయకులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాష రచనలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జాతీయ సాహిత్య పరిషత్ కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మాతృభాష రచనలను ప్రోత్సహించి, బాలలకు నీతి కథలను వివరించాలని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం అన్నారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన 'మన బాలసాహిత్యం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మాతృభాష స్పష్టంగా ఉచ్ఛరించినప్పుడే ఇతర భాషలపై పట్టు సాధిస్తారని అన్నారు. ఎన్ని భాషలు నేర్చినా.. మాతృభాషలో ప్రావీణ్యం తప్పనిసరి అని అన్నారు. నీతి కథల పుస్తకాలను బాలలు చదివేలా చూడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ కవులు ఎన్నవెల్లి రాజమౌళి, బస్వ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎర్రకుంట పరిశీలన



పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్ శివారులో ఎర్ర కుంటను ఇరిగేషన్ ఏఈ విష్ణువర్ధన్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. కుంటను మట్టితో పూడ్చుతున్నారని గ్రామానికి చెందిన మత్స్యకారులు ఫిర్యాదు చేయగా పరిశీలించినట్లు తెలిపారు. త్వరలోనే సర్వే చేసి ఎఫ్.టీ.ఎల్ పరిధిని నిర్ధారించి హద్దు రాళ్లను ఏర్పాటు చేస్తామన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మెడల్స్ సాధించిన విద్యార్థులు

వర్గల్(గజ్వేల్): నల్గొండ జిల్లా నకిరేకల్‌లో ఆదివారం జరిగిన ఎనిమిదో రాష్ట్ర షోటోకాన్ కరాటే పోటీల్లో వర్గల్ మండలం గౌరారం విద్యార్థులు ప్రతిభ చూపారు. బాలికల విభాగంలో ఎస్.మోక్షిత, బాలుర విభాగంలో బీ.అశ్రుత్, పీ.అవినాష్‌గౌడ్, పీ.హర్షత్, సీహెచ్.శర్వన్, ఎన్.అక్షరసాయి గోల్డ్‌మెడల్, ఎన్.శివ, జీ.కృష్ణసాయి సిల్వర్ మెడల్ సాధించినట్లు కరాటే మాస్టర్ చీకోటి సుధాకర్ తెలిపారు.

రేపటి నుంచి ఓపెన్ డిగ్రీ ప్రాక్టికల్స్

సిద్దిపేటఎడ్యుకేషన్: అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ సైన్స్ విద్యార్థులకు ఈ నెల 28 నుంచి ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నట్లు సిద్దిపేట రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ భవాని తెలిపారు. సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, మెదక్ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాల గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు 7382929615 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

త్రీడీ ఎప్పుడో?

ట్రిపుల్ ఆర్ గెజిట్ నోటిఫికేషన్‌లో జాప్యం

భూసేకరణ పరిహారం లెక్కలపై స్పష్టత ఏదీ?

గజ్వేల్: ట్రిపుల్‌ఆర్ (రీజినల్ రింగు రోడ్డు)లో కీలకమైన త్రీడీ గెజిట్ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం జరుగుతోంది. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో భూసేకరణకు ప్రజాభిప్రాయసేకరణ దాదాపు పూర్తి కావొచ్చింది. దీని తర్వాత త్రీడీ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసి భూసేకరణ పరిహారం లెక్కలు తేల్చాలి. అయితే ఈ ప్రక్రియ ఎందుకో ముందుకు సాగటం లేదు.

- ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) ట్రిపుల్‌ఆర్ 110 కిలోమీటర్లకుపైనే విస్తరించనుంది. 14మండలాల్లోని 73కిపైగా గ్రామాల్లో భూసేకరణ జరపాలి. జగదేవ్‌పూర్–గజ్వేల్–తూప్రాన్–నర్సాపూర్–సంగారెడ్డి మీదుగా కంది వరకు ట్రిపుల్‌ఆర్ పరిధి ఉంటుంది.
- ప్రజాభిప్రాయసేకరణకు సంబంధించి సిద్దిపేట జిల్లాకు సంబంధించి గజ్వేల్‌లో, మెదక్ జిల్లాకు సంబంధించి నర్సాపూర్‌లో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా బాధితుల నుంచి పెద్ద నిరసన వ్యక్తమైంది. ఒక దశలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సంగారెడ్డి జిల్లాలో ఇంకా ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదు.
- భూముల విలువ అమాంతంగా పెరిగిన తరుణంలో వాస్తవ విలువకు, ప్రభుత్వమిచ్చే పరిహారానికి పొంతన లేదని, ఈ నేపథ్యంలో భూమికి బదులు భూమి ఇవ్వాలనే డిమాండ్‌ను అధికారుల ముందుంచారు. లేదంటే మార్కెట్ వాల్యూకు దగ్గరలో పరిహారం ఇచ్చి, ఇతర సహాయక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఆ నోటిఫికేషన్ వస్తేనే పరిహారం లెక్కలు తేలేదీ

- త్రీడీ గెజిట్ నోటిఫికేషన్ జారీ అయితే పరిహారం లెక్కలపై ఒక స్పష్టత వస్తుంది. సర్వే నంబరు, రైతు పేరు, సేకరించనున్న భూ విస్తీర్ణం తదితర వివరాలు అధికారికంగా తెలుస్తాయి.
- ట్రిపుల్ ఆర్‌తో భూమి కోల్పోయే రైతులు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్‌చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే పరిహారం ఆమోదయోగ్యంగా లేకపోతే మరింత ఒత్తిడి పెంచాలనే ఆలోచనలోనూ రైతులు ఉన్నారు.
- ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో సుమారు మూడు వేల ఎకరాల్లో భూ సేకరణ చేపట్టనున్నారు.



రీజనల్ రింగు రోడ్డు ఉత్తర భాగం మ్యాపు

పరిహారం ఎలా ఇస్తారో...?

బడ్జెట్ కేటాయింపులకు సంబంధించిన సమస్యల కారణంగానే త్రీడీ గెజిట్ నోటిఫికేషన్ తాత్కాలికంగా పెండింగ్‌లో పడిందనే విషయం ప్రచారం జరుగుతోంది. అయితే పరిహారం పంపిణీకి గతంలో అవలంభించిన విధానామే ఉంటుందా? అందులో ఏమైనా మార్పులు చేర్పులు చేస్తారా అన్నది వేచిచూడాల్సిందే. భూముల విలువ పెరిగాక పరిహారం కూడా పెంచాలనేది రైతుల వాదన. అందుకు అనుగుణంగా ట్రిపుల్‌ఆర్‌లో ప్రభుత్వం ఏ రేట్ ఫిక్స్ చేస్తుందోనని రైతులు ఎదురుచూస్తున్నారు.



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

మల్లన్న ఆలయం.. భక్తజనమయం

- కిటకిటలాడిన ఆలయ పరిసరాలు
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మల్లన్న నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. స్వామివారి దర్శనానికి ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శనివారం రాత్రి క్షేత్రానికి చేరుకున్న భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి, స్నానమాచరించి ఒక్కపొద్దులు, మట్టికుండలలో పసుపు బియ్యంతో బోనం వండి నైవేద్యం సమర్పించారు. అనంతరం గంగిరేణి చెట్టు వద్ద బోనాలు పెట్టి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించారు. అనంతరం రేణుక ఎల్లమ్మకు బోనాలు చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి దర్శనానికి సుమారు 6 గంటల సమయం పట్టింది. స్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన కాటంగౌడ్ 1కిలో 500 గ్రాములు వెండి వస్తువులను ఆలయ ఈఓ బాలాజీకి ఆదివారం అందించారు. అడిషనల్ డీసీపీ (అడ్మిన్) మహేందర్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ సత్యనారాయణ రెడ్డి, కొమురవెల్లి, కోహెడ ఎస్ఐలు చంద్రమోహన్ యాదవ్, నరేందర్ రెడ్డి బందోబస్తు ఏర్పాటు చేశారు.

తప్పని ఇబ్బందులు

శనివారం సాయంత్రం ఆలయానికి భక్తులు చేరుకోవడంతో వసతి గృహాలు నిండిపోయాయి. గంటల తరబడి బుకింగ్ కార్యాలయం వద్ద వేచి చూశారు. భక్తులకు తాగేందుకు మంచి నీరు, టాయిలెట్ సౌకర్యం లేకపోవడంతో ఆలయ అధికారుల తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.



గంగిరేణి చెట్టు వద్ద భక్తుల కోలాహలం



పట్నాలు వేస్తున్న భక్తులు

పునరుద్ధరణ పనులు వేగవంతం చేయండి

సీఎంఓ కార్యాలయ అధికారి భూపాల్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న భూపాల్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): వరదరాజస్వామి ఆలయ పునరుద్ధరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సీఎంఓ కార్యాలయ అధికారి భూపాల్‌రెడ్డి అధికారులకు సూచించారు. రూ.10కోట్లతో చేపట్టిన వర్దరాజ్‌పూర్ వరదరాజ స్వామి ఆలయ పునరుద్ధరణ పనులను ఆదివారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తో కలిసి పరిశీలించారు. సీఎం ఆదేశాల మేరకు ఆలయ నిర్మాణ పనులను పరిశీలించినట్లు తెలిపారు. గర్భగుడి లోపల విగ్రహాల చుట్టూ పక్కల సరిపడా స్థలం ఉండేలా చూడాలని, గర్భగుడి గోపురం ఎత్తు, ధ్వజస్తంభం కంటే ఎక్కువ ఎత్తు ఉండేలా అమర్చాలన్నారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని అసహనం వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఆర్కిటెక్చర్ ఆనంద్ సాయికి సూచించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు సమయం దగ్గర పడుతున్న క్రమంలో కూలీల సంఖ్యను పెంచి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. 128 ఎకరాల ఆలయ మాన్యం భూమి కబ్జా కాకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం రెండున్నర కోట్లతో చేపడుతున్న హనుమాన్, ఆర్చ్ కమాన్ పెద్దమ్మ ఆలయ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ఆర్డీఓ విజయేందర్‌రెడ్డి, ఎస్ఈ బసంత్‌నాయక్, ఈఈ సుదర్శన్ రెడ్డి, డీఈ బాలప్రసాద్, సర్పంచ్ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కబ్జాలపై ఇంటెలిజెన్స్ ఆరా

సాక్షి ఎఫెక్ట్..

కోహెడ(హుస్నాబాద్): కోహెడలో సర్వే నంబర్ 768లో బాడుగుల చెరువు 47.36ఎకరాలు, సర్వే నంబర్ 1229లో 6.30ఎకరాల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జా, భవన నిర్మాణాలపై ఇంటెలిజెన్స్ శాఖ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. 'ప్రభుత్వ భూమి దర్జాగా కబ్జా' శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. విచారణ వేగవంతం చేశారు. ఇప్పటికే గ్రామానికి చెందిన పలువురిని విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. తక్షణ చర్యల కోసం నివేదికను సిద్ధం చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందించాలని ఆదేశించారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని సర్వే చేయాలని సీపీఐ, బీజేపీ మండల పార్టీల నాయకులు తహసీల్దార్ జావిద్ అహ్మద్, ఎంపీడీఓ మధుసూదన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సర్వే నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిసింది.

కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి



ఎమ్మెల్యే రఘునందన్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

దుబ్బాక: దేశ కరెన్సీ నోట్లపై డా.బీఆర్ అంబేడ్కర్ ఫొటోను ముద్రించాలని అంబేడ్కర్ సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డా.జెర్రిపోతుల పరశురాం, నాయకులు గజ్వేల్ రామచంద్రం అన్నారు. ఈ మేరకు ఆదివారం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రణ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దేశానికి అంబేడ్కర్ చేసిన సేవలను భవిష్యత్ తరాలకు తెలిపేలా నోట్లపై ముద్రణ చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబటి బాలేష్ గౌడ్, భాను ప్రసాద్ రావు, అరికె కృష్ణ, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 10 గంటలకు మొదటి ఆరాధన ప్రారంభం కాగా.. భక్తులనుద్దేశించి చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య దైవసందేశమిచ్చారు. కాగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గొల్లకురుమల సంక్షేమానికి కృషి

ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

కంది(సంగారెడ్డి): రాష్ట్ర ప్రభుత్వం గొల్ల, కురుమల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని మామిడిపల్లి శివారులో నిర్మించనున్న కురుమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కురుమ సంఘం భవనాన్ని రూ.80లక్షలతో నిర్మించనున్నట్లు తెలిపారు. కురుమ సంఘం నాయకుల అభ్యర్థనమేరకు మామిడిపల్లి శివారులో ఎకరా 23 గుంటల భూమిని కేటాయించినట్లు చెప్పారు. ఈ స్థలంలో అన్ని హంగులతో భవన నిర్మాణాన్ని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, కలెక్టర్ డాక్టర్ శరత్, ఎమ్మెల్యేలు మహిపాల్ రెడ్డి, క్రాంతికిరణ్, తహసీల్దార్ విజయలక్ష్మి, కురుమ సంఘం జిల్లా నాయకులు నగేశ్, పాండు పాల్గొన్నారు.



కురుమ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

భక్తులతో కిటకిటలాడిన ఏడుపాయల



అమ్మవారి ఆలయంలో భక్తులు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల వనం ఆదివారం భక్తులతో నిండిపోయింది. పూజారులు అమ్మవారిని పసుపు రంగు పట్టు చీర, గులాబీ పూల దండలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. జాతరకు రాలేని భక్తులు ఏడుపాయలకు వచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు. ఒడిబియ్యం, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సత్రాలు దొరకక పలువురు ఇబ్బందులు పడ్డారు. పూజల అనంతరం భక్తులు చెట్ల కింద టెంట్లు వేసుకొని విందు చేసుకున్నారు. చైర్మన్ బాలాగౌడ్, ఈఓ సార శ్రీనివాస్, పాలకమండలి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అడుగు పడింది

సొంతింటి కలకు మార్గం సుగమం

- రూ.60కోట్ల అంచనాతో డీపీఆర్
- పైలెట్ ప్రాజెక్టుగా సిద్దిపేట బల్దియా
- తొలివిడతలో 2010 మంది గుర్తింపు

సిద్దిపేటజోన్: చలికి వణుకుతూ.. వర్షానికి తడుస్తూ పూరిగుడిసెలు.. పెంకుటిళ్లలో జీవనం సాగిస్తున్న పేదల కష్టాలు త్వరలో తీరనున్నాయి. మంత్రి హరీశ్‌రావు కృషితో సిద్దిపేటలో త్వరలో పేదల సొంతింటి కల నెరవేరనుంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల చొప్పున సుమారు రూ.60 కోట్ల పైచిలుకు అంచనాతో మున్సిపల్ అధికారులు డీపీఆర్ సిద్ధం చేశారు. ఇంటి నిర్మాణం కోసం సాయం అందించేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట మున్సిపాలిటీని పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. మొదటి విడతలో 2010 మంది లబ్ధిదారులను గుర్తించి, ఈనెల 21న రిపోర్ట్‌ను ప్రభుత్వానికి అందజేశారు. సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో మున్సిపల్ అధికారులు గుర్తించిన లబ్ధిదారుల స్థితిగతులపై హడ్కో బృందం సైతం తనిఖీ చేపట్టింది.

అర్హుల గుర్తింపు..

- 2011 జనాభా లెక్కల ప్రకారం సిద్దిపేట మున్సిపల్ పరిధిలోని 43 వార్డుల్లో 1,15,879 మంది ఉండగా, 2022 నాటికి 1,46,963 మందికి చేరారు.
- ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డబుల్ బెడ్ రూం పథకం ద్వారా సుమారు 2వేల మందికి కేసీఆర్ నగర్‌లో ఇళ్లను కేటాయించారు.
- ఇంటి స్థలం ఉండి నిర్మాణం చేసుకునే స్తోమత లేని వారికి ఆర్థిక సాయం అందించేందుకు బల్దియా అధికారులు సర్వే చేపట్టారు.
- ఎన్సీపీఈ ఆధ్వర్యంలో రాష్ట్రంలో సిద్దిపేట మున్సిపాలిటీలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ పథకాన్ని చేపట్టనున్నారు.



లబ్ధిదారుల ఇంటి వద్ద విచారణ చేస్తున్న హడ్కో బృందం

- ప్రభుత్వ నిబంధనల మేరకు 30 గజాల స్థలంలో రేకులు, గుడిసెలు, పెంకుటిళ్లలో తాత్కాలికంగా జీవనం సాగిస్తున్న వారి వివరాలను మెప్మా ఆధ్వర్యంలో సేకరించారు.
- ఈ లెక్కన సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలోని 2010 మందిని అర్హులుగా గుర్తించారు.
- వీరందరికి పీఎంఏవై కింద గృహ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు అధికారులు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించారు.
- రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో హడ్కో బృందం సభ్యులు ఆదివారం సిద్దిపేటలో పర్యటించారు.
- పట్టణంలోని 2, 3, 11, 16, 31, 32, 34, 36, 37 వార్డుల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో వివరాలను సేకరించారు. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించనున్నారు.

ప్రక్రియ వేగవంతం



పేదలకు సొంతింటి కల నిజం చేసేందుకు మున్సిపల్ పరిధిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ పటిష్టంగా చేపట్టాం. మొదటి విడతలో 2010 మందిని గుర్తించి, డీపీఆర్‌ను ప్రభుత్వానికి అందించాం. హడ్కో బృందం సభ్యులు కూడా క్షేత్రస్థాయి తనిఖీ చేపట్టారు. తదుపరి ప్రక్రియ వేగవంతం చేస్తాం.

– రవీందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

డంప్‌యార్డ్‌లో అగ్ని ప్రమాదం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ పట్టణ శివారు పిడిచెడ్ రోడ్డు మార్గంలోని నల్లవాగు సమీప డంప్‌యార్డ్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు క్రమంగా పెరిగి దట్టమైన పొగతో అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక సిబ్బంది యార్డ్‌కు చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. కాగా గతంలో కూడా రెండుసార్లు డంప్‌యార్డులో అగ్ని ప్రమాదం సంభవించాయి. వరుస ప్రమాదాలతో రైతులు భయాందోళనలు చెందుతున్నారు.

బస్సు ఢీ: మహిళకు గాయాలు

రామాయంపేట(మెదక్): ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్ష్మాపూర్ స్టేజీ వద్ద ఆదివారం రామాయంపేట నుంచి మెదక్ వెళ్తున్న మెదక్ డిపో బస్సు బైక్‌ను ఢీకొంది. దీంతో బైక్‌పై వెనుక కూర్చున్న లక్ష్మాపూర్‌కు చెందిన లక్ష్మి కిందపడి గాయపడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐ రంజిత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ కాలిపై నుంచి వెళ్లిన ఆర్టీసీ బస్సు

జోగిపేట(అందోల్): జోగిపేట బస్టాండ్‌లో ఓ మహిళ కాలిపై నుంచి ఆర్టీసీ బస్సు ముందు చక్రాలు వెళ్లడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. జోగిపేట ఎస్‌ఐ సామ్యా నాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ నుంచి జోగుపేట బస్టాండ్‌లోకి ఆర్టీసీ బస్సు వస్తుండగా అందోలు గ్రామానికి చెందిన దయ్యాల నర్సమ్మ(58) అక్కడే నిలబడి ఉంది. బస్సు ముందుకు కదలడంతో ఆమె కింద పడటంతో ముందు చక్రం ఆమె కాలుపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను జోగుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం సిట్టింగ్ రూమ్‌లో..

తూప్రాన్: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం మున్సిపల్ పరిధిలోని పోతరాజుపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోతరాజుపల్లి గ్రామానికి చెందిన వడ్డెర నరేశ్(30) శనివారం సాయంత్రం గ్రామంలోని మద్యం దుకాణం పక్కనే ఉన్న సిట్టింగ్ గదిలో మద్యం తాగాడు. మద్యం వ్యాపారులు సిట్టింగ్ గదిని పరిశీలించకుండనే రాత్రి వెళ్లి పోయారు. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి నరేశ్ అనుమానా స్థితిలో మృతిచెంది పడిఉన్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చెరుకొని బోరున విలపించారు. పోలీసులకు మాత్రం అతిగా మద్యం తాగి మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

లారీ ఢీకొని వృద్ధురాలి మృతి

మనోహరాబాద్(తూప్రాన్): లారీ ఢీ కొని వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని దండుపల్లి యూటర్న్ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జీడిపల్లిలోని గొల్లగడ్డ వీధికి చెందిన బొల్లబోయిన దుర్గమ్మ(75) రాత్రి సమయంలో రోడ్డు దాటుతోంది. ఈక్రమంలో హర్యానాకు చెందిన లారీ ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. దుర్గమ్మను తూప్రాన్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి కుమారుడు నర్సింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపారు.

పార్క్‌లా వైకుంఠధామం

- రూ.2 కోట్లతో అన్ని సౌకర్యాలతో ఆధునీకరణ
- 20 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటు
- పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం
- రూపాయికే వైకుంఠ రథం, వసతులు, సిబ్బంది సేవలు



సదాశివపేట బైపాస్‌లో నిర్మించిన వైకుంఠధామం ముఖ ద్వారం

సదాశివపేట(సంగారెడ్డి): శ్మశాన వాటికకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతుంటారు. అక్కడి వాతావరణమే అందుకు ఓ కారణం. కానీ ప్రస్తుత పరిస్థితులు మారిపోయాయి. ఆహ్లాదకర వాతావరణం ఉండేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంత్యక్రియలు జరిపేందుకు వచ్చే వారు ఇబ్బందిపడకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు.

- సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలోని 65వ నంబర్ జాతీయ బైపాస్ రోడ్డుకు అనుకుని ఉన్న హిందు వైకుంఠధామం పార్కును తలపిస్తుంది.
- పట్టణంలోని 26 వార్డుల్లో దాదాపు 70 వేలకు పైగా జనాభా ఉంది. టీయూఎఫ్ఐడీసీ నుంచి రూ కోటి, శ్మశాన వాటిక అభివృద్ధికోసం ప్రభుత్వం ప్రత్యేకంగా మరో రూ.కోటి కేటాయించింది. దీంతో రూ.2 కోట్లతో వైకుంఠదామం సకల సౌకర్యాలతో అధునీకరించారు.
- అంతిమ సంస్కారం గౌరవప్రదంగా, పరిశుభ్రంగా ఉండాలని అధికారులు వైకుంఠధామాలను అన్ని హంగులతో అధికారులు తీర్చిదిద్దారు.
- అంత్యక్రియలు జరిపేందుకు వచ్చే వారికి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలతో సుందరంగా నిర్మించారు.
- వైకుంఠధామం చుట్టూ ప్రహరీ, పచ్చని చెట్లు, సీసీ రోడ్లు, లైట్లు, దహన సంస్కారాలకు వచ్చే వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.
- లోపల ప్రహరీకి ఆనుకుని మొక్కలు నాటడంతో ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.
- దీంతో పట్టణ, మండల ప్రజలతోపాటు 65వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ మీదుగా వెళ్లే ప్రయాణికులు ఈ వైకుంఠధామాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు.
- మృతదేహాలను వైకుంఠధామం వరకు తీసుకెళ్లేందుకు వైకుంఠ రథం, సిబ్బంది, సౌకర్యాలను కేవలం రూపాయికే అందిస్తూ అంతిమ సంస్కారాలకు మున్సిపల్ సేవలందిస్తోంది.

వైకుంఠధామంలో సకల సౌకర్యాలు

- వైకుంఠధామంలో సెక్యూరిటీ గది, స్టోరేజ్ గది, మూడు బర్నింగ్ యూనిట్‌లు, దింపుడు కళ్లం, వెయిటింగ్ గ్యాలరీ, టాయిలెట్ బ్లాక్, పూజా మండపం, తలనీలాలు సమర్పించే వేదిక, కట్టెల స్టోరేజ్, సిట్టింగ్ గ్యాలరీ, వాటర్ ఫౌంటెయిన్, హైమాస్ట్ లైటింగ్, గ్రీనరీ, పుట్‌పాత్ పార్కింగ్, భద్రతా పరంగా నిర్మించిన కాంపౌండ్ వాల్, కార్పొరేట్, రిసార్ట్‌లను తలపించేలా నిర్మించిన స్వాగత తోరణం, 20 అడుగుల శివుడి విగ్రహం ఏర్పాటుచేశారు.
- పార్క్‌ను తలపిస్తున్న వైకుంఠధామానికి వచ్చిన పట్టణ వాసులు మున్సిపల్ అధికారులను ప్రశంసిస్తున్నారు. అయితే ప్రతీ పట్టణం, గ్రామానికి శ్మశాన వాటిక ఉండాల్సిందేనని తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయింతో వైకుంఠధామాలు ఏర్పాటు చేస్తున్నారు.


వైకుంఠధామంలో ఏర్పాటుచేసిన శివుడి విగ్రహం

- వైకుంఠధామం చుట్టూ మొక్కలు నాటారు. గార్డెన్ ఏరియా, షెడ్ నిర్మాణం, స్నానాల గదులు ఏర్పాటు చేశారు.
- వైకంఠధామం నిర్వహణలో మున్సిపాలిటీయే కాకుండా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు, పట్టణ ప్రముఖుల భాగస్వామ్యం ఉంటే బాగుంటుందని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.


కౌన్సిలర్‌తో గ్రామస్తుల వాగ్వాదం

అనుమతి లేకుండా వృక్షాల నరికివేత

- కలప తరలిస్తున్న వాహనం అడ్డగింత
- అధికారులకు సమాచారం ఇచ్చిన గ్రామస్తులు
- కలపతోపాటు వాహనం సీజ్

తూప్రాన్: రూ.కోట్లు వెచ్చించి హరితహారం కార్యక్రమంలో మొక్కలు నాటుతుంటే తూప్రాన్ మున్సిపల్ పరిధిలో భారీ వృక్షాలను ఎలాంటి అనుమతి లేకుండా నరికివేస్తున్నారు. మున్సిపల్ పరిధిలోని 2 వార్డు తాతపాపన్‌పల్లికి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న టేకు చెట్లతో పాటు భారీ వృక్షాలను నరికి వాహనాల్లో తరలిస్తుండగా గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. గ్రామానికి సమీపంలో ఓ ప్రైవేట్ సీడ్ పరిశ్రమ ఉంది. పరిశ్రమ ప్రహరీకి ఆనుకొని ఉన్న చెట్లను ఆ వార్డు కౌన్సిలర్ మామిడి వెంకటేశ్ నరికించాడు. ఎందుకు నరికివేస్తున్నారని గ్రామస్తులు నిలదీయడంతో కౌన్సిలర్ పొంతనలేని సమాధానాలు ఇచ్చాడు. ఆ గ్రామ మాజీ వార్డు సభ్యుడు చంద కృష్ణతో పాటు గ్రామస్తులు చెట్లు నరికి వేయడం సమంజసం కాదని మండిపడ్డారు. కలపను తరలిస్తున్న వాహనానికి అడ్డంగా పడుకుని వార్డు సభ్యుడు చంద కృష్ణ అడ్డుకున్నాడు. అనంతరం జిల్లా అటవీ అధికారికి సమాచారం ఇచ్చారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

తాతపాపన్‌పల్లి గ్రామ సమీపంలోని చెట్ల నరికివేతకు అనుమతులు ఇవ్వలేదు. చెట్లు నరికిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. కలపతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తాం.

– రవి ప్రసాద్, జిల్లా అటవీశాఖ అధికారి

చింతపండు కోసం చెట్టెక్కి..

ప్రమాదవశాత్తు జారిపడి మహిళ దుర్మరణం

వర్గల్(గజ్వేల్): చింతపండు సేకరించేందుకు చెట్టెక్కిన మహిళ పట్టుతప్పి ప్రమాదవశాత్తు కిందపడి దుర్మరణం చెందింది. ఈ విషాదకర ఘటన ఆదివారం వర్గల్ మండలం నాచారంలో జరిగింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతగిరిపల్లికి చెందిన కాయిత భూలక్ష్మి(55) భర్త మృతి చెందడంతో నాచారంలోని తన కూతురు బండ్ల వాణి ఇంటి వద్దే ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బంధువులతో కలిసి గ్రామ పొలిమెరలోని చింతచెట్ల నుంచి చింతపండు తెంపేందుకు వెళ్లింది. పండు తెంపేందుకు చెట్టెక్కిన భూలక్ష్మి ప్రమాదవశాత్తు పట్టుకోల్పోయి కింద ఉన్న బండరాయిపై పడింది. తలకు గాయమై అక్కడికక్కడే దుర్మరణం చెందింది. తల్లి భూలక్ష్మి కళ్ల ముందే మృతి చెందడంతో కూతురు, కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రోదిస్తున్న కుటుంబ సభ్యులు

భారతీయ సంస్కృతికి 'పరంపర' జీవం

రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు


సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

పాపన్నపేట(మెదక్): భారతీయ సంస్కృతికి పరంపర సంస్థ జీవం పోస్తోందని ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఆదివారం రాత్రి పవిత్ర పుణ్యక్షేత్రం ఏడుపాయల పరంపర సౌజన్యంతో నిర్వహించిన శ్రీదేవి ఆధ్యాత్మిక నృత్య ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీదేవి నృత్య కళాకారులు ఏడుపాయల ఆలయం వద్ద ప్రదర్శించిన హనుమాన్ చాలీసా, మహిషాసుర మర్దిని, బ్రహ్మమొక్కటే తదితర నృత్య రూపకాలు అలరించాయన్నారు. భారతీయ సంస్కృతి, శాస్త్రీయ నృత్యాలు, పుణ్యపురుషుల కళారూపాలను చూస్తుంటే అద్భుత ప్రపంచంలోకి వెళ్లిన ఆనందం కలుగుతోందన్నారు. పాశ్చాత్య అనుకరణలతో మన సంస్కృతి కనుమరుగు కాకుండా పరంపర సంస్థ చేస్తున్న కృషిని పొగిడారు. సీఎం కేసీఆర్ భారతీయ సంస్కృతి పరిరక్షణకు, ఆచార వ్యవహారాల గొప్పదనాన్ని, ఆలయాల ఔనత్యాన్ని చాటిచెబుతున్నారని మంత్రి పేర్కొన్నారు. కోరిన వెంటనే ఏడుపాయలలో ప్రదర్శన ఏర్పాటు చేసిన పరంపర సంస్థ సభ్యులకు, కళాకారులకు కృతజ్ఞతలు తెలిపి వారిని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కమిషన్ చైర్మన్ సునీతారెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, అమెరికన్ కాన్సులేట్ ప్రతినిధి జెనీఫర్, పరంపర ప్రతినిధులు స్వాతి, కలెక్టర్ రాజర్షిషా, అదనపు కలెక్టర్లు ప్రతిమసింగ్, రమేశ్, ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, ఏడుపాయల చైర్మన్ బాలగౌడ్, ఆయా శాఖల అధికారులు, మెదక్, సిద్దిపేట జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు.


కళాకారుల నృత్యప్రదర్శన


కార్యక్రమాన్ని తిలకిస్తున్న మంత్రి హరీశ్‌రావు, విదేశీ ప్రముఖులు

యువకుడి అనుమానాస్పద మృతి


గొగ్గ మహాదేవ్ (ఫైల్)

నారాయణఖేడ్: హైదరాబాద్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడు శవమై కనిపించాడు. ఆదివారం అతడి మృతదేహాన్ని ఖేడ్ మండలం జూకల్ శివారులోని వెంచర్‌లో గుర్తించారు. కంగ్టి పోలీసులు, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కంగ్టి మండలం నాగూరు (బి) గ్రామానికి చెందిన గొగ్గ బస్వరాజ్, దేకమ్మ దంపతులకు మహాదేవ్(29), మల్లికార్జున్ (24) సంతానం. వారం కిందట పెద్దకుమారుడు మహాదేవ్ హైదరాబాద్ వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఫోన్‌చేస్తే స్పందన రాకపోవడంతో తెలిసినవారిని, బంధువులను విచారించారు. అతడి ఆచూకీ లభించకపోవడంతో తండ్రి బస్వరాజ్ కంగ్టి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు వారు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఖేడ్ నుంచి జూకల్‌కు వెళ్లే రహదారి పక్కనున్న పోల్ల వెంచర్‌లో మోదుగు చెట్టు కింద యువకుడి మృతదేహాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఖేడ్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లిన విచారణ చేపట్టారు. కంగ్టి పోలీస్‌స్టేషన్‌లో యువకుడి అదృశ్యం కేసు నమోదవడంతో పోలీసులు మహాదేవ్ కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చూసి మృతదేహం మహాదేవ్‌దేనని నిర్ధారించారు. అదృశ్యం కేసును అనుమానాస్పద మృతిగా మార్చి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో రాయిపల్లి మాజీ సర్పంచ్ మృతి


తాజొద్దీన్

మనూరు(నారాయణఖేడ్): మనూరు మండల పరిధి రాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ తాజొద్దీన్ గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. ఈయన 2014 నుంచి 2019 వరకు సర్పంచ్‌గా సేవలందించాడు. బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేశాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించి, కుటుం సభ్యులకు సంతాపం తెలిపారు. ఆదివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియలకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు.

ఓబీసీలో చేర్చాలని వినతి


హన్స్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నారాయణఖేడ్: లింగాయత్, ఆరే మరాఠాలను ఓబీసీ జాబితాలో చేర్చాలని జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాం అహీర్‌ను బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడ సంగప్ప కోరారు. ఆదివారం జాతీయ ఓబీసీ కమిషన్ చైర్మన్ హైదరాబాద్‌కు రావడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌తో కలిసి సంగప్ప చైర్మన్‌ను కలిశారు. అనంతరం సంగప్ప లింగాయత్ సమాజ్ నాయకులు, చైర్మన్‌తో చర్చించి వినతిపత్రం ఇచ్చారు. వీరశైవలింగాయత్‌లు, ఆరే మరాఠాలు వెనుకబడి ఉన్నారని, అందువల్ల వీరిని ఓబీసీ జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేయడంతో జాతీయ ఓబీసీ చైర్మన్ సానుకూలంగా స్పందించారని సంగప్ప తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

■ Wanted Franchise / Agents in Hyderabad & All Telangana & All Andhra Pradesh. New Maruthi Couriers and Cargo Services Call: 9010459283 [H-793615]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10–15 వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059508586 [G-781850]

■ HYDలో ప్రముఖ E-కామర్స్, ఫార్మా, MNC కంపెనీలకై హెల్పర్స్, ప్యాకర్స్, సూపర్ వైజర్స్, సెక్యూరిటీ గార్డ్స్, కేటరింగ్ బాయ్స్ కావలెను, రూం+భోజనం ఫ్రీ. జీతం: 15,000–30,000. ఫోన్: 9347467236 [HA-10322]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నేత్రపర్వంగా రాచన్న కల్యాణం


శ్రీరాచన్న స్వామి కల్యాణం


కల్యాణం తిలకిస్తున్న భక్తులు

కోహీర్(జహీరాబాద్): సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బడంపేట శివారులోని భద్రకాళి సమేత శ్రీరాచన్న స్వామి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆదివారం రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన స్వామివారి కల్యాణ మండపంలో వేలాది మంది భక్తులు హరహర మహాదేవ శంభో శంకరా, రాచరాయ ప్రభు మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తుండగా మాంగల్యాధారణ కార్యక్రమం నిర్వహించారు. తలంబ్రాలు, జీలకర్ర, బెల్లం, ఎదురుకోలు కన్నులపండువగా జరిగాయి. అంతకు ముందు స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులకు అమృత గుండంలో మంగళ స్నానం నిర్వహించి పట్టువస్త్రాలు, వెండి బంగారు అభరణాలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు మోగుతుండగా భక్తులు రామచందర్ రాజనర్సింహ దంపతులు ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి తీసుకెళ్లారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రాద వితరణ, అన్నదానం చేశారు.

వినూత్నంగా పంటకు నీటి తడులు

- రంధ్రాల పైపులతో జొన్న చేనుకు నీళ్లు
- సరికొత్త ఆలోచనతో పంటల సాగు


కాలువలు చేసి నీటిని పారిస్తున్న రైతు

అల్లాదుర్గం(మెదక్): పంటల సాగుపై రైతులు తమ వినూత్న ఆలోచనతో ప్రయోగాలకు శ్రీకారం చుడుతున్నారు. నీటి ఆదా చేయడం కోసం డ్రిప్ విధానం పాటిస్తారు. పంటకు నీటి తడులు అందించేందుకు బోరు నుంచి పైపు ద్వారా నీటిని పారిస్తారు. అయితే ఓ రైతు రంధ్రాల పైపు ద్వారా అర ఏకరంలో కాలువలు చేసి జొన్న పంటకు నీటిని పారిస్తున్నాడు.

అల్లాదుర్గం మండలం బహిరన్‌దిబ్బ గ్రామంలో రైతులు బోరు బావుల వద్ద జొన్న పంట సాగు చేస్తున్నారు. బోరు నుంచి పైపు ద్వారా పొలంలో వేసి నీటి తడులు అందిస్తారు. బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన రైతు నర్సప్ప బోరు అనుసంధానం చేసిన పైపునకు రంధ్రాలు చేసి జొన్న పంటకు నీటిని పారిస్తున్నాడు. నర్సప్పకు ఐదెకరాల పొలం ఉంది. బోరు లేదు. తన పొలం పక్కనే ఉన్న రైతు బోరు నుంచి డబ్బులు చెల్లించి జొన్న పంటకు నీళ్లు పెట్టుకుంటున్నారు. మొత్తం పంటకు నీళ్లు పారబెట్టాలంటే అక్కడే గంటల తరబడి ఉండాలి. వినూత్న ఆలోచనతో పైపునకు 30 రంధ్రాలు చేయడంతోపాటు నీరు పారేందుకు కాలువలు చేశాడు. బోరు ఆన్ చేయడంతో రంధ్రాల పైపు ద్వారా పంటకు నీళ్లు పారబెడుతున్నాడు. కూలీలు లేకుండా పంటకు నీటి తడులు అందిస్తుండటంతో తోటి రైతులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ విధానంలో పంట దిగుబడి పెరిగే అవకాశం ఉందని రైతు నర్సప్ప చెబుతున్నాడు. మూడెకరాలతోపాటు, మరో ఐదు ఎకరాలు కౌలు తీసుకొని జొన్న పంట సాగు చేస్తున్నట్లు తెలిపాడు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు


గాయపడిన మహేశ్

దుబ్బాకరూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట నుంచి దుబ్బాకకు బైక్‌పై వస్తున్న వ్యక్తి, ఇదే క్రమంలో అప్పనపల్లి నుంచి చిన్నగుండవెళ్లికి బైక్‌పై మహేశ్(33) వెళ్తున్నాడు. మండలంలోని అప్పనపల్లి గ్రామంలో ఎదురెదురుగా ఢీ కొనడంతో మహేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.